క్లుప్తంగా

టోల్‌ప్లాజా ఉద్యోగులకు అండగా ఉంటాం

కైలాస్‌నగర్: టోల్‌ప్లాజా ఉద్యోగులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా యూనియన్ సభ్యులు గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి తమ సమస్యలను వివరించారు. గత 12 ఏళ్లుగా తమకు టీవోటి కంపెనీ ద్వారా నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించేలా చూడాలని విన్నవించారు. సంతోష్, ప్రశాంత్, ప్రభాకర్, రమేశ్, గంభీర్, ఆశన్న పురుషోత్తం తదితరులు ఉన్నారు.

రేపు జాతీయ ఓటర్ల దినోత్సవం

కైలాస్‌నగర్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25న ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. అంతకుముందు ఉదయం 9.30 గంటలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి జెడ్పీ వరకు ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కల్లు దుకాణం పరిశీలన


పరిశీలిస్తున్న ఎస్సై ముజాహిద్

సాక్షి స్పందన

ఆదిలాబాద్‌రూరల్: 'జోరుగా కల్తీకల్లు విక్రయాలు' శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ స్పందించారు. పట్టణంలోని సర్వే నెంబర్ 68లోని తెల్లకల్లు దుకాణాన్ని పరిశీలించారు. షాపు లైసెన్స్ పత్రాలపై ఆరా తీశారు. యజమాని అందుబాటులో లేకపోవడంతో ఆ పత్రాలను తీసుకుని పోలీసుస్టేషన్‌కు రావాలని అక్కడ పనిచేసే వ్యక్తికి సూచించారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు సాగిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

సీఎం సలహాదారుడిని కలిసిన పద్మశాలీలు


వేం నరేందర్‌రెడ్డితో పద్మశాలీలు

ఆదిలాబాద్‌రూరల్: సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్ సచివాలయంలో ఆదిలాబాద్ తాలుకా పద్మశాలీలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి రమేశ్, చేనేత పద్మ సమైక్య జిల్లా అధ్యక్షుడు మోర ఆశన్న, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర్ల శంకరయ్య, ఉపాధ్యక్షులు చిప్ప గంగన్న, మెంచు ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వివరాలు అందించాలి

కైలాస్‌నగర్: జిల్లాలోని కేబుల్, డిష్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ కంపెనీ ప్రతినిధులు ఏయే ప్రాంతాల్లో.. ఎన్ని విద్యుత్ స్తంభాలను కేబుల్ వైర్ల కోసం వినియోగిస్తున్నారో ఈ నెల 31లోపు వివరాలు అందజేయాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. కరెంట్ స్తంభాలపై ఇష్టారీతిన ఏర్పాటు చేస్తున్న వైర్లను ఒకే దగ్గర బంచ్‌లా ఏర్పాటు చేయాలని, పోల్ చార్జీలు వెంటనే చెల్లించాలని ఆదేశించినా ఇప్పటివరకు స్పందన లేదని పేర్కొన్నారు. దీని కారణంగా తమ సిబ్బందికి స్తంభాలపైకి ఎక్కడానికి తీవ్ర ఇబ్బంది అవుతోందని తెలిపారు. దీనిపై స్పందించకుంటే విద్యుత్ స్తంభాలపై ఉన్న ఆయా వైర్లను తొలగిస్తామని హెచ్చరించారు.

ఇంద్రవెల్లి పోరాటాల స్ఫూర్తిని కొనసాగిస్తాం

ఉట్నూర్‌రూరల్: రాంజీగోండ్, కుమురం భీం, ఇంద్రవెల్లి పోరాటాల స్ఫూర్తిని కొనసాగిస్తామని ఆదివాసీ హక్కుల పోరాటసమితి తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త పుర్కబాపురావు అన్నారు. దూరమైన తెగలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తుడుందెబ్బ యత్నిస్తుందన్నారు. ఇందులో భాగంగా గురువారం వరంగల్ జిల్లా హన్మకొండలో మహాసభలు నిర్వహించి ప్రధాన సమస్యలపై ఉమ్మడి జిల్లాల నుంచి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. రాష్ట్ర కన్వీనర్, కో కన్వీనర్లు బుర్స పోచయ్య, లక్ష్మీనారాయణ, నగేశ రవీందర్, రవి, రాంమూర్తి, విజయ, కోలయ్య, రఘు, కిశో తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో నిరసనల పర్వం

- తమ పేర్లు లేవంటూ అధికారుల నిలదీత
- ఆందోళన చేపట్టిన గ్రామస్తులు


నేరడిగొండ: ఆందోళన చేస్తున్న గ్రామస్తులు


తాంసి: భీంపూర్ మండలం నిపానిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

నేరడిగొండ: రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలను అర్హుల ఎంపిక కోసం ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు గురువారం మూడోరోజు కొనసాగాయి. ఈ సభల్లో నిరసనల పర్వం సాగుతుంది. జాబితాలో తమ పేర్లు లేవని అర్హులు అధికారులను నిలదీశారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. మండల కేంద్రంతోపాటు సవర్గాం, దర్బాతండా, గుత్పాల, నారాయణ్‌పూర్, తేజాపూర్‌లో అనర్హుల పేర్లు ఉన్నాయని నిలదీశారు. గత 20 ఏళ్ల నుంచి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని సవర్గం గ్రామస్తులు ఆరోపించారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉండడంతో ఆందోళన చేపట్టారు. జాబితాల్లో అర్హుల పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో శాంతించారు. కాగా, తేజాపూర్‌లో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. దరఖాస్తులు తీసుకుంటున్న తీరును పరిశీలించారు. ప్రజాపాలనలో ప్రజలందరికీ మేలు జరుగుతుందని, బీఆర్‌ఎస్ నాయకుల దొంగ నాటకాలను నమ్మవద్దన్నారు.

గ్రామసభలో వాగ్వాదం

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనర్హుల పేర్లే ఎక్కువగా ఉన్నాయని మండిపడ్డారు. అనర్హుల పేర్లు తొలగించి అర్హుల పేర్లు చేర్చాలని డిమాండ్ చేశారు. వీరికి బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, యువ నాయకులు రాథోడ్ రాజశేఖర్, షేక్ బాబా, బాక్రే శేఖర్, ప్రజలు, యువకులు మద్దతు పలికారు. అధికారులతో మాట్లాడారు. మరోసారి సర్వే నిర్వహించి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం గ్రామసభను ముగించేశారు.

గ్రామసభల్లో ఆందోళన

తాంసి: పొన్నారి, తాంసి గ్రామసభల్లో గందరగోళం నెలకొంది. జాబితాలో అర్హుల పేర్లు లేవని ఆందోళన చేపట్టారు. తాంసిలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి వారికి సర్దిచెప్పారు. సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలని పొన్నారి తహసీల్దార్ లక్ష్మికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ గణేశ్, మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, ఎంపీవో లింగయ్య, డీఎస్పీ జీవన్‌రెడ్డి, రూరల్ సిఐ ఫణీందర్, ఎస్సై రాధిక, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: రూ.2 లక్షల రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ దర్మంపూరి రైతులు నిరసన తెలిపారు. 65 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, ఇద్దరు ముగ్గురికి ఇచ్చి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. కాగా, ఇచ్చోడ మేజర్ పంచాయతీ గోడకు అతికించిన అర్హుల జాబితాలో పేర్లు చూసుకోవడానికి గురువారం దరఖాస్తుదారులు బారులు తీరికనిపించారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం

అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తామని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. భీంపూర్ మండలం నిపాని, తాంసి మండలంలోని సావర్గాం గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామసభలను డీఎస్పీ జీవన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. నిపానిలో పేర్లు రాలేదని ప్రజలు అధికారులను నిలదీయగా, అదనపు కలెక్టర్ నచ్చజెప్పారు. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.2లక్షల రుణమాఫీ కాలేదని రైతులు తహసీల్దార్ నలందప్రియకు వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శి సునీత ఉన్నారు.

మున్సిపాలిటీలో ముగిసిన వార్డు సభలు

కైలాస్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలో గత మూడు రోజులుగా నిర్వహించిన వార్డు సభలు గురువారంతో ముగిశాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం 4,611 దరఖాస్తులు అందగా, రేషన్ కార్డుల కోసం 7,448 దరఖాస్తులు అందాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ఒక దరఖాస్తు చొప్పున మొత్తం 12060 దరఖాస్తులు అందినట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు తెలిపారు. వార్డు సభల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఈనెల 26 నుంచి ఈ పథకాలు అందనున్నట్లుగా వివరించారు.

ఇంద్రవెల్లి: దొడంద, ఈశ్వర్‌నగర్, మర్కగూడ, హర్కపూర్‌తండా, బిక్కుతండా, గిన్నే, శంకర్‌గూడ, హీరాపూర్‌లో గ్రామసభలు నిర్వహించారు. జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తులు అందించాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్ సూచించారు. ఏఎంసీ చైర్మన్ ఉత్తం, ఏవో రాథోడ్ గణేశ్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, నాయకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: జాతర్ల, డేద్ర, రాంపూర్, గంగాపూర్, పిప్రి, టెంబి, మంజరంతాండ, గిరిజాయి గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి డీసీవో మోహన్ అధ్యక్షతన గురువారం గ్రామసభలు సజావుసాగాయి. ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఏఈవో వెంకటేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సిరికొండ: పోన్న, వాయపేట్, నారాయణపూర్, నేరడిగొండ(జీ)లో గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్ ఉన్నారు.

బోథ్: పిప్పల్‌ధరి, మర్లపెల్లి, పార్డి(బి), ధన్నూర్(బి), ఘన్‌పూర్, గుట్టపక్కతండా, కోట(కె), వజ్జరలో గ్రామసభలు కొనసాగాయి. జాబితాలో అనర్హులను అధికారులు తొలగించారు.

తలమడుగు: అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తామని మండల ప్రత్యేక అధికారి గజానంద్ తెలిపారు. సకినాపూర్, నందిగామ్, ఉండం, పల్సి, కప్పర్‌దేవి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో మేఘమాల, ఎంపీవో వినోద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బేల: అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తామని మండల ప్రత్యేక అధికారి మనోహర్‌రావు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో మహేందర్‌కుమార్ అర్హుల జాబితా చదువుతుండగా దరఖాస్తుదారులు అభ్యంతరం తెలిపారు. అర్హుల పేర్లు లేకపోవడంపై మండిపడ్డారు. ఆర్‌ఐ సాజిద్, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మీవాడలో రూ.85 లక్షలతో రోడ్డు, రూ.30 లక్షలతో డ్రెయినేజీ, సీసీ రోడ్లు, రూ.కోటి వ్యయంతో 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు వార్డుల్లో రూ.11 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా రూ.300 కోట్లతో పట్టణంలో పైపులైన్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారుల ను ఆదేశించారు. బల్దియా అధికారులు, బీజేపీ నా యకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కృష్ణకు మార్షల్ ఆర్ట్స్ అవార్డు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్ నాంపల్లిలోని బిర్లా ఆడిటోరియంలో ఈనెల 21న అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డు వేడుక జరిగింది. మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హైకోర్టు అడ్వొకేట్ సతీశ్, మనోహర్, ప్రముఖులు మహిపాల్‌రెడ్డి ఉట్నూర్‌కి చెందిన బండారి కృష్ణకి అవార్డు అందించారు. బోధి బుడోకాన్ కరాటే అకాడమీ కరాటే మాస్టర్స్ ముకేశ్ కుమార్, రమేశ్‌లు ఆయన్ను అభినందించారు.

బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్


గేర్జంలో ఆరోగ్య ఉపకేంద్రానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని కేశవపట్నంలో సీసీ రోడ్లు, గేర్జంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణా పనులకు గురువారం భూమిపూజలు చేశారు. అనంతరం భీమన గుట్టలో పర్యటించారు. ఎమ్మెల్యే మాటాడుతూ గత బీఆర్‌ఎస్ హయంలో పల్లెప్రకృతి వనా లు, వైకుంఠధామాలు, అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగుకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ సర్పంచ్ పాండురంగ్, నాయకులు అల్తాఫ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

నేరడిగొండ: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని తేజాపూర్ గ్రామంలో సీసీ రోడ్డుతోపాటు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పండరీ, ప్యాక్స్ చైర్మన్ నానక్ సింగ్, వీడీసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అనిల్ అన్న యువ సైన్యం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జంగీ జాతర


డోల్ వాయిద్యాలతో ఆదివాసుల ర్యాలీ

బేల: మండలంలోని సదల్‌పూర్ శివారులోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాల్లో కొరంగే వంశీయుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలతో గురువారం జంగీ జాతర ప్రారంభమైంది. ఆదివాసీ పూర్వీకుల సంప్రదాయబద్ధంగా డోల్ వాయిద్యాలు, భజన కీర్తనల మధ్యన ఊరేగింపు ర్యాలీని చేపట్టారు. ఆలయాల్లో మండల రాయిసెంటర్ అధ్యక్షుడు కొరంగే సోనేరావు దంపతులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆలయ కమిటీ సభ్యులు జాతర ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌రావు, కార్యదర్శి పెందుర్ రాందాస్, ఆదివాసీ పర్దాన్ సంఘం మండల అధ్యక్షుడు నైతం సీతరాం, మాజీ ఎంపీటీసీ కొడపే అరుణ్, మాజీ సర్పంచులు కొరంగే జంగ్షా, ఆడ శంకర్, జై జంగో జై లింగో దీక్షదారులు పాల్గొన్నారు.

సీఎంకు లక్ష పోస్టుకార్డులు


ఇచ్చోడ: పోస్టుకార్డులు చూపుతున్న నాయకులు

ఇచ్చోడ: రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిరోజు ప్రార్థనలో భాగంగా చదివించాలని ధర్మసమాజ్ రాష్ట్ర సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అన్నెల లక్ష్మణ్ అన్నారు. లక్ష పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా ఇచ్చోడ పోస్టాఫీస్ కార్యాలయం నుంచి ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ అమలు రోజైన గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా వద్ద అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్: బోథ్ పోస్టాఫీస్ కార్యాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి భాగంగా ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్ మహరాజ్ గురువారం ఉత్తరాలు పంపించారు. మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శులు రమేశ్, గజానంద్, లక్ష్మణ్, బద్రి నాయక్, నిఖిల్, అఖిల్, ఆకాశ్, ఉదయ్, స్వామి, శ్రీనివాస్ సంతోష్, వెంకట్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు సర్కిల్ నరేశ్ అధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పోస్టుకార్డులు పంపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


తులసిరెడ్డి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన తులసిరెడ్డి జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని కోచ్ జయేంద్ర పటాస్కర్ తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో ఈనెల 29వ తేదీ నుంచి జరగనున్న ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

వాణిజ్య స్థలంగా మార్పు

కైలాస్‌నగర్: ఖుర్షాపూర్‌లోని ఇంటి నంబర్ 4-3-58/12, 7-1-33/సి, 7-1-33/సి/1, 7-1-33/బి, ప్లాట్ నం.37లోని 1969.01 చదరపు మీటర్ల స్థలాన్ని మాస్టర్ ప్లాన్‌లో నివాస యోగ్యంగా ఉన్న స్థలాన్ని వాణిజ్య స్థలంగా మార్పు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై ఏమైన అభ్యంతరాలు ఉంటే ప్రజలు 15 రోజుల్లోగా కార్యాలయంలో వివరించవచ్చని సూచించారు.

జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

కైలాస్‌నగర్: 2023 సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని ఉపాధ్యాయుల జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని, 2023-24 సంవత్సరానికి సంబంధించిన వడ్డీ త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ నాయకులు కోరారు. జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్, నర్ర నవీన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మందకృష్ణకు సన్మానం

ఆదిలాబాద్: ఎస్సీ వర్గీకరణ సన్నాహక సమావేశానికి గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను ఎమ్మెల్యే పాయల్ శంకర్ సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్గీకరణతో పాటు జిల్లాకు సంబంధించిన రాజకీయ అంశాలపై కొద్దిసేపు వారు చర్చించారు. అనంతరం జిల్లాకు చెందిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకులు మందకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి ఇరువురిని సన్మానించారు. నాయకులు, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి


సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు


ఆదిలాబాద్: చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చౌక్‌లోని ఆయన విగ్రహానికి రిమ్స్ వైద్యుడు, ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ్ చాలక్ నూతుల కళ్యాణ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో మరణంలేని వీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. విద్యార్థులు, యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, ఎన్‌వైకే డైరెక్టర్ నాగేందర్‌గౌడ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఖడ్సే అక్షయ్, కోకన్వీనర్ నిఖిల్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మహేశ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డా.అతిక్ బేగం, వైస్ ప్రిన్సిపల్ రఘు, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: సొనాల గ్రామంలోని వివేకానంద పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. కరస్పాండెంట్ ఓరుగంటి ఇస్తారి, ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్: సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ శిశుమందిర్లో తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్తవ్య బోధ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపిక్రిష్ణ,, నాయకులు రాజ్ కుమార్, మనోజ్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, మురళీ, దత్తాత్రి, రాజేశ్వర్, కేశవ్, గోపాల్, సంజీవ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా



తరుణ్‌తో కోచ్ రాజు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి రమావత్ తరుణ్ జాతీయస్థాయి జూడో పోటీల్లో గురువారం రజత పతకంతో మెరిశాడు. పుణె వేదికగా జరుగుతున్న జాతీయ సబ్ జూనియర్ కేడేట్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో 55 కేజీల విభాగంలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ రాజు తెలిపారు. డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, శిక్షకులు రమేశ్, సాయి, క్రీడా సంఘాల బాధ్యులు స్వామి, వీరేష్ ఆయనకు అభినందనలు తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

తాంసి: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ ఏపీవో వసంత్‌రావు అన్నారు. భీంపూర్ మండలం రాజ్‌ఘడ్‌లో గురువారం ఐటీడీఏ, మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు గేదెలు పంపిణీ చేశారు. రాజ్‌ఘడ్, వడ్గాం, బెల్సరీరాంపూర్ గ్రామాలకు చెందిన 25 మంది మహిళలకు రూ.లక్ష విలువ చేసే గేదేల యూనిట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులు ఏపీవోను సన్మానించారు. విజయడెయిరీ డీడీ మధుసూదన్, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ హబీబ్, సంస్థ ప్రతినిధులు రమేశ్, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ చిన్ను ,గ్రామపటేల్ భీంరావు తదితరులు ఉన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: ఫిబ్రవరి 14,15,16 తేదీల్లో నిర్వహించే గాంధారి ఖిల్లా మైసమ్మ మహా జాతర పోస్టర్‌ను ఐటీడీఏ పీవో పీవో ఖుష్బూ గుప్తా తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు భార్గవ్, నాయకులు రాజ్‌కుమార్, భూమేశ్, రమేశ్‌బాపు, పృథ్వీరాజ్, రాజయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సిరికొండలో శోభాయాత్ర


శోభాయాత్రలో భక్తులు

సిరికొండ: మండల కేంద్రంలో సనాతన ధర్మ సేవా సమితి సిరికొండ ఆధ్వర్యంలో సనాతన సేవ సమితి సమ్మేళన సభ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా గ్రామంలో శోభాయాత్ర నిర్వాహించారు. అనంతరం సభ ప్రాంగణంలో శ్రీ నారాయణ మహరాజ్ సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం చేయించారు.

గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలింపు

నేరడిగొండ: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఆయన బోథ్‌కు వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో నేరడిగొండ పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని అంబులెన్స్ ద్వారా నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరు ఆరోగ్యంపై దృష్టి సారించాలని పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ సంతోష్ అన్నారు. కుమారి జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలతోపాటు గుత్పాలలోని మినీ గురుకులంలో గురువారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల రక్త నమూనాలను సేకరించారు. హెచ్‌ఈఓ పవార్ రవీందర్ తదితరులు ఉన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

నార్నూర్: మండలంలోని ఎంపల్లి గ్రామంలో దివ్యశ్రీ ఫౌండేషన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, మాజీ సర్పంచ్ రాథోడ్ గోవింద్ గురువారం ప్రారంభించారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు శ్రీరామ్, ఉపాధ్యాయుడు రవీందర్, మాజీ ఉపసర్పంచ్ పైకు, మాజీ ఎంపీటీసీ మాణిక్య రావు తదితరులు ఉన్నారు.